# గాలిలో దీపం

తలుపులు దగ్గరకు లాగి గొళ్ళెం పెట్టి, తాళం వేసి, ఎండ ముఖం చూస్తూ నడిచిపోయాడు స్కూల్ మాష్టారు. రెక్కలొచ్చిన పక్షుల్లాగా బడి పిల్లలు ఎగురుతూ, దూకుతూ, పరుగెత్తుతూ, వెళుతున్నారు. నడవటం లేదు.

సీతమ్మ పిల్లలందరిని అడిగింది. కిట్టిగాడు 'కనిపించాడా?' 'ఊఁ' అనలేదు. 'ఆ' అనలేదు గానీ వాళ్ళు ఎగిరిందే ఎగరటం, వెళ్ళిందే వెళ్ళటం. మూణ్ణెల్లు వేసవి సెలవులు. కిట్టిగాడు సీతమ్మకు లవుడు, కుశుడూను. మళ్ళీ స్కూల్ తెరవగానే ఒకటో తరగతిలో ఈ బళ్ళోనే చేర్చాలనుకొంటూవుంది సీతమ్మ.

కిట్టిగాడు గడుగ్గాయి. ఉన్న చోట ఉండడు. చెప్పింది వినడు, చేయమన్నది చేయడు, వద్దన్నది ముందుగా చేస్తాడు. అక్కడా ఇక్కడా పడతాడు. ముక్కూ మూతి బద్దలు కొట్టుకొంటాడు. నోరూ చేయి ఊరుకుండవు. ఆకతాయి. అంతా కలిపితే నాలుగేళ్ళు.

ఒకసారి తేపతేపకూ పొయ్యి దగ్గరకు వస్తుంటే అడ్డమయి, భయమయి రావద్దని సీతమ్మ చెప్పింది.

కిట్టిగాడు లెక్కపెట్టలేదు.

అక్కడికి వస్తే కాళ్ళిరగ్గొడతాను. ఇక్కడే కూర్చోమని నట్టింట్లో కుదేసి వంట గదిలోకి వెళ్ళింది.

పదినిముషాల్లో అక్కడ లేడు.

ఇంటి ముందుకు వచ్చిచూస్తే చెట్టుక్రింద కూర్చొన్నాడు.

'ఏరా! ఇక్కడ తగలబడ్డా'వని అంటే కదల్లేదు.

'లే' అని చెవిపట్టుకొంటే, నవ్వాడు. ఏడుపు ముఖం.

చెవి మెలిపెడితే 'ఇహిహీ'అని నవ్వటమేకాని ఏడవటం లేదు. పిచ్చినవ్వు.

ఇంత సేపు కదలకుండా కూర్చున్నాడేమా అనిచూస్తే కాలువిరిగివుంది.

సీతమ్మ గుండె చెరువయింది.

ఆ రోజు నుండి సీతమ్మకు చీరాకు కలిగినా కిట్టిగాణ్ణి శాపనార్థాలు పెట్టటం మానుకొంది.

పొద్దున పొంతలో వేన్నీళ్ళు, చన్నీళ్ళతో తొరుపుతుంటే కిట్టిగాడు వచ్చి ఏదో అడిగాడు. అప్పటికే విసిగి పోయివున్న సీతమ్మ కోపంతో 'ఎక్కడో చావుపో' అంది.

అన్న తర్వాత గుండెకు చలిజ్వరం వచ్చి కిట్టిగాడికోసం చూసింది.

వీడు దణ్ణెం పట్టుకొని ఉయ్యాల ఊగుతున్నాడు.

సీతమ్మ ఊపిరి పీల్చుకొంది, ఊరట పడింది.

అయిదు నిముషాల్లో ఆయిపు లేడు. గుండె అల్లాడింది. ఆరాటం పెరిగింది.

పొద్దట్నుంచి పొద్దునెత్తిమీదకు వచ్చిందాకా వెతుకుతూవుంది. వూరంతా తిరుగుతూనే వుంది. ఎదురయిన వాళ్ళను అడుగుతూనే వుంది. కళ్ళనీళ్ళు పైట చెంగుతో తుడుచు కొంటూనే వుంది సీతమ్మ.

కొడుకు కనబళ్ళేదు. కిట్టిగాడు కనబళ్ళేదు. బంగారుకొండ కనబళ్ళేదు.

ఒకసారి కోళ్ళగూడులో పగలంతా పడుకొన్నాడు,

వెదికింది లేడు.

చెరువుగట్టు మీద నిద్రపోయాడోసారి.

చూసింది. లేడు.

వాముల దొడ్లో నిద్రపోయాడు మరోసారి.

వెళ్ళింది. లేడు.

వెదికి, వెదికి మనిషి పిచ్చిపట్టినట్లు అయిపోయింది, సీతమ్మ. ముద్దుగా, బొద్దుగా, ఆరోగ్యంగా ఉండే కిట్టిగాడు నాలుగేళ్ళకే ఆరేళ్లవాడిలా కనిపిస్తాడు. అనిపిస్తాడు, అంటారు.

విరామం లేకుండా తిరుగుతాడు. నిద్రవస్తే అర సెకండులో నిద్రపోతాడు. లేపినా లేవడు. కదిపినా కదలడు. మొద్దు నిద్ర. ప్రక్కన పిడుగుపడనీ, కిట్టిగాడి నిద్ర చెడదు.

నేల మీద, దుమ్ములో, ఎండలో, చలిలో, పడక లేకుండా, నిద్రపోయే ముద్దు.

ఇంటి పట్టున వుండకుంటే ఆగమ్మకాకి లాగా తిరుగుతుంటే కోపం వచ్చి లోపల పెట్టి తలుపు గొళ్ళెం వేసి సీతమ్మ బయట నుంచి చూసింది ఒక రోజు

నిద్రపోయాడు.

సాయంకాలానికి మెలకువ వచ్చి లేచాడు. అటూఇటూ తిరిగాడు. 'అమ్మా' అని అరచాడు.

తలుపుదగ్గరకు వచ్చాడు, లాగాడు, రాలేదు. కిటికీ దగ్గరకు పోయాడు, గుంజాతు, కదల్లేదు.

వెలుతురు గీరపడుతున్న చోటల్లా మిణుగురు పురుగులాగా తిరిగాడు.

బయటకు రాలేక బావురుమని ఏడ్చాడు.

చూస్తున్న తల్లి గుండె తల్లడిల్లింది. తలుపు తీసింది.

'అమ్మా!' అని కాళ్ళకు చుట్టుకుని వేలబడిపోయాడు.

ప్రొద్దుటినుంచి వచ్చి గంగయినా ముట్టుకోకుండా వుంది. సీతమ్మ తలుపుకు ఆనుకుని అలాగే కూర్చుండిపోయింది.

రోజులూ, వారాలూ గడిచాయి.

కొడుకు జాడలేదు.

అంత్రాలు, తంత్రాలు కట్టింది. చేయించింది. లాభంలేదు. సోదె చెప్పింది. దేవుళ్ళకు మొక్కుకుంది. లాభంలేదు.

కళ్ళు కనుగుంటల్లోకి పీక్కుపోయి, మనిషి ఎండిపోయింది.

వేసవి సెలవలు అయిపోయాయి.

ఆ రోజే బడిపిల్లలు మళ్ళీ స్కూళ్ళకుపోవటం చూసింది.

'వీడివాళ స్కూలుకు పోయివుండవలసింది' అని గొణుక్కుంది.

ఎక్కడున్నాడో కొడుకు.

వేసవి సెలవులకు స్కూలు మూసే రోజున కిట్టిగాడు ఊరంతా తిరగాడు.

ఎద్దు పొడవబోతే పారిపోయి చెట్టుకు కొట్టుకొన్నాడు.

తలకు బొప్పికట్టింది. లారీకింద పడబోయి పరుగెత్తుకుపోయాడు. తిట్లు తిన్నాడు. అలసిపోయాడు.

విశాలమయిన పాత తోటలో పాడుబడ్డ మేడ బాగు చేయించి బడి చేస్తే, అందులోకి బడిపిల్లలు తప్ప ఎవరూ పోని చోటికి రోజూ పిల్లలు వస్తూ పోతూ వుండటం చూసి కిట్టిగాడు వెళ్ళాడు.

కిట్టిగాడు వెళ్ళేసరికి మాష్టరు లేడు. పిల్లలంతా కీ బే.... అని చదువుతున్నారు. గోల.

కిట్టిగాణ్ణి ఎవ్వరూ పట్టించుకోలేదు. కిట్టిగాడు వాళ్ళనెవరినీ పలకరించలేదు.

మూలన, చీకటిలో జానెత్తు బెంచీ వెనుక చేరగిలబడి నిద్రపోయాడు.

వేసవి సెలవులు ముగిసి పిల్లలంతా వచ్చారు.

బడి ముందు నిలబడ్డారు. అప్పుడే మేష్టారు వచ్చాడు.

సెలవుల్లో పిల్లలు ఏమేమి చేసింది చెప్పుకుంటూ వున్నారు.

తాళం తీసి, గొళ్ళెం తీసి, తలుపులు తోసి, పాముకాటు తిన్నవాడిలాగా మాష్టారు వణికిపోయాడు.

వాకిట్లో, రెండు తలుపులకు మధ్య బోర్లాపడి, రెండున్నర మూడు అడుగులు పొడవున్న ఒక పసి ప్రాణి అస్థిపంజరం.